క్లుప్తంగా

10 నుంచి మిట్టగుడిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని మిట్టగుడిపాడు గ్రామంలో ఈ నెల 10 నుంచి నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి ఆదివారం తెలిపారు.

నేడు అడిగొప్పలలో జగనన్న ఆరోగ్య సురక్ష

అడిగొప్పల (దుర్గి): మండల పరిధిలోని అడిగొప్పల సచివాలయం 1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ హఫీజుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ఎం.రమేష్ కుమార్, ఎంపీడీఓ కె.సమతావాణి, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పలు రకాల వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ వైద్య శిబిరంలో సంబంధిత వైద్యులను సంప్రదించి ఉచితంగా వైద్య సహాయం పొందాలన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి గాయాలు

గురజాల : ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మాచర్ల మండలం కంభంపాడు గ్రామానికి చెందిన ఓర్సు శ్రీరామ్ పిడుగురాళ్ల వైద్యశాలలో ఉన్న చెల్లెలిని చూడటానికి టీవీఎస్ ఎక్సెల్‌పై బయలుదేరాడు. గురజాల నుంచి మాచర్లకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బొలెరో వాహనాన్ని క్రాస్ చేస్తున్న తరుణంలో రెంటచింతల సమీపంలో నర్సరీ వద్ద టీవీఎస్ ఎక్సెల్ వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓర్సు శ్రీరామ్ తలకు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనం ద్వారా గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించి మెరుగైన వైద్యం కొరకు గుంటూరుకు రిఫర్ చేయడం జరిగింది. క్షతగాత్రుడి భార్య లక్ష్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

రెంటచింతలలో వేసవిని తలపిస్తున్న ఎండలు

రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాలలోనే ప్రతి వేసవిలో మంటచింతలగా పేరు పొందిన రెంటచింతల ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా వర్షాకాలంలో సైతం వేసవిని తలపిస్తూ మండుతున్న ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా రెంటచింతలలో 37.5 నుంచి 38.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ ఎండలకు గ్రామాలలోని చెరువులు, కుంటలు, బోరులు ఎండిపోతున్నాయి. ఈ ఏడాది వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం వలన పగలు భగభగ మంటూ ఎండ కాస్తుంటే బయటకు రావడానికి ప్రజలు జంకుతున్నారు. పగలు, సాయంత్రం తేడా లేకుండా ఉక్కపోతగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేతకు(పశుగ్రాసం) కోసం పొలం వెళ్లిన పశువులు, జీవాలు(మేకలు, గొర్రెలు) ఎండ తీవ్రకు తట్టుకోలేక నీటి మడుగులలోకి, చెట్లనీడకు చేరుకుంటున్నాయి.

కౌలు రైతు ఆత్మహత్య



మాచర్ల రూరల్: మండలంలోని రాయవరం గ్రామంలో పురుగుమందు తాగి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కరుముల కృష్ణారెడ్డి (38) 5 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. సాగులో సరైన దిగుబడి రాక రూ.7 లక్షల వరకు అప్పులపాలయ్యాడు. అప్పులిచ్చినవారు ఒత్తిడికి గురిచేయటంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే వైద్యశాలకు తీసుకెళ్ళగా వైద్యులు చికిత్స నిర్వహిస్తుండగా మృతిచెందాడు. ఈయనకు భార్య దివ్య, కుమారులు సువర్షరెడ్డి, అఖిల్‌రెడ్డిలు ఉన్నారు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్



ఈపూరు: మండలంలోని చిట్టాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఈపూరు ఎస్‌ఐ మహమ్మద్ ఫిరోజ్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4960 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

వృద్ధులకు అన్నదానం

సత్తెనపల్లి: లయన్స్ సేవా దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి టౌన్ లయన్స్ క్లబ్ సభ్యులు పట్టణంలోని మొల్లమాంబ వృద్ధాశ్రమంలో వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మంచికంటి వేంకటేశ్వర రావు, సభ్యులు వై.పి.మురళీకృష్ణ, తోట చినసాంబశివరావు, కె. గురుప్రసాద్, పెద్దింటి వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ గ్రామాన జగనన్న ఆరోగ్య సురక్ష

ఆరోగ్యకర సమాజ నిర్మాణమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తుంది. అందులో భాగంగా ప్రతి పల్లెలో ఆధునిక సౌకర్యాలతో కూడిన వైఎస్సార్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. అంతేకాకుండా ఆరోగ్య సురక్ష పథకం కింద వైద్య పరీక్షలు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి అనంతరం ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందించేందుకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసింది. దీర్ఘకాలిక రోగులు, గర్భిణులకు ప్రత్యేక సేవలతో పాటు ఈసీజీ, స్కానింగ్, బీపీ, షుగర్ వంటి టెస్టులను శిబిరంలోనే చేస్తూ నిపుణులైన వైద్యులచే అత్యుత్తమ చికిత్సలందిస్తున్న ప్రభుత్వ సేవలను ప్రజలు కొనియాడుతున్నారు.



కంభంపాడు గ్రామంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు వెస్లి



కొత్తపల్లి గ్రామంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు ప్రదీప్



కొత్తపల్లి గ్రామంలో ఈసీజీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

- ఆప్యాయంగా వైద్య సేవలు
- శిబిరాలకు వెల్లువలా జనం

మాచర్ల రూరల్: ప్రజలందరికి నాణ్యమైన వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో కార్పొరేట్ వైద్యాన్ని సైతం గ్రామానికి తీసుకొచ్చి ప్రతి పల్లెలో ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రత్యేక వైద్యుల పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. 10 రోజుల క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ప్రతి రోజూ సచివాలయ పరిధిలో, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలలో వైద్య శాఖ వారు షెడ్యూలు ప్రకారం శిబిరాలు నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరాలలో ఒక్క రూపాయి ఖర్చు లేకుండా స్పెషలిస్టు సేవలు అందుతున్నాయి. వైద్యులు సూచించిన మందులు ఉచితంగా అందజేస్తున్నారు. శిబిరాలలో వేలాది మంది ప్రజలకు అవసరమైన 14 రకాల వైద్య పరీక్షలతో పాటు, 170 రకాల మందులను అందుబాటులో ఉంచారు. అవసరమైన మేరకు కంటి పరీక్షలు, ఈసీజీలు, రక్త పరీక్షలు, ఫుడ్ సప్లిమెంటేషన్ మ్యాపింగ్ చేస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసి, ఫ్యామిలీ డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల పర్యవేక్షణ జరుపుతున్నారు. తమ గ్రామానికే వచ్చి స్పెషలిస్టులు ప్రత్యేక వైద్య సేవలందించి విలువైన మందులను ఉచితంగా అందించి ఆరోగ్య భరోసా కల్పిస్తున్న జగనన్న ప్రభుత్వానికి ప్రజలు జే జేలు పలుకుతున్నారు.

పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం..



ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తుంది. వైద్య రంగంలో చరిత్రాత్మక విప్లవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ప్రతి గ్రామంలో వైఎస్సార్ క్లినిక్, పట్టణాలలో హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఆరోగ్య శ్రీ పథకానికి మరింత మెరుగులు దిద్దటమే కాకుండా 17 మెడికల్ కాలేజీలతో వైద్య చరిత్రలో రికార్డు సృష్టించారు. రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా చేసేందుకు సీఎం కృషి చేస్తున్నారు. ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నారు.

పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి

30వేల మందికి పైగా ప్రజలకు వైద్య సేవలు



నియోజకవర్గంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలలో 30వేల మందికి పైగా ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాం. ముందుగానే ప్రతి ఇంటిని ఏఎన్‌ఎంలు సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామ, పట్టణాలలో నిర్వహించే శిబిరాలకు వేల సంఖ్యలో ప్రజలు వస్తున్నారు. వీరికి ఆర్థోపెడిక్, నేత్రాలు, గైనకాలజీ, చిన్నపిల్లల, చెవి, ముక్కు, గొంతు, గుండె సంబంధించిన వైద్యులు ప్రత్యేక సేవలు అందిస్తున్నారు. శిబిరాలలో ఈసీజీ, స్కానింగ్ వంటి ఆధునికీరణ యంత్రాల ద్వారా పరీక్షలు జరిపి ఉచితంగా మందులు అందిస్తున్నాయు .

డాక్టర్ వెస్లి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

రూ.29 కోట్లతో పెదగార్లపాడులో అభివృద్ధి పనులు

- టీడీపీ హయాంలో రూ.80లక్షల అభివృద్ధే జరిగింది
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెదగార్లపాడు గ్రామంలో రూ.29కోట్ల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని స్థానిక శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెదగార్లపాడు గ్రామంలో ఎమ్మెల్యే కాసు ఆదివారం పర్యటించారు. ఇంటింటికి తాగునీరు అందించేందుకు రూ.2.50 కోట్లతో నిర్మించనున్న పైపులైన్ల పనులకు ఎమ్మెల్యే కాసు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన కర్నూరపు వెంకట్రావమ్మ ప్రమాణస్వీకార మహోత్సవంలో పాల్గొన్నారు. సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసిన వెంకట్రావమ్మ, వెంకటకోటయ్య దంపతులను ఎమ్మెల్యే కాసు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం రూ.80లక్షల అభివృద్ధి మాత్రమే జరిగిందని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన నాలుగున్నరేళ్లలో రూ.29కోట్లతో పెదగార్లపాడు సర్వతోముఖాభివృద్ధి సాధించిందన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ఇలా..

రూ.3కోట్ల విలువ చేసే స్థలాల్లో 280మంది నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇచ్చామని, రూ1.80 కోట్ల అమ్మఒడి నగదు, రూ1.40 కోట్ల జగనన్న విద్యా కానుక, 153 కుటుంబాలకు రూ.40లక్షల కాపునేస్తం, 683మందికి పెన్షన్లు, 958 మంది రైతులకు రైతుభరోసా ద్వారా రూ.3.4కోట్లు ఇచ్చామని ఆయన చెప్పారు. రూ.94లక్షలతో ప్రభుత్వ పాఠశాలను ఆధునీకరణ చేశామని, రూ.80లక్షలతో గ్రామ సచివాలయం, రూ.1.80 కోట్లతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని ఆయన తెలిపారు. గత 40 ఏళ్ల చరిత్రలో దాచేపల్లి–పెదగార్లపాడు గ్రామాల మధ్య రూ.6కోట్లతో తారు రోడ్డు నిర్మించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామ పరిధిలోని సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి నిధులు ఇప్పించి గ్రామంలో సిమెంట్ రోడ్లు వేశామని, గత టీడీపీ ప్రభుత్వంలో టీడీపీ నేతలు ఫ్యాక్టరీ వద్ద నిధులు తీసుకుని పందికొక్కుల్లా తిన్నారని ఆయన అన్నారు. మీరంతా పెద్ద మనస్సుతో అభివృద్ధి సంక్షేమం అమలు చేసే మాకు అండగా నిలవాలని ఎమ్మెల్యే కాసు కోరారు. ఈ కార్యక్రమంలో కర్నూరపు వెంకటకోటయ్య, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్ సత్తార్, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కటికాల వరలక్ష్మి, పుప్పాల శివ, వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు ముత్యం చెన్నారెడ్డి, చింతారెడ్డి బ్రహ్మారెడ్డి, కామిరెడ్డి రామిరెడ్డి, పురంశెట్టి శ్రీనివాసరావు, పిన్నం పుల్లారావు, చొక్కా శ్రీనివాసరావు, బైరపాగు కోటేశ్వరరావు, కొత్త దీనయ్య, మద్దు ఏసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫాదర్ బాలస్వామికి సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని క్రైస్తవ చర్చిలు, ఏబీఎం చర్చి, హౌస్ ఆఫ్ ప్రేయర్స్ చర్చిలను రాష్ట్ర ప్రభుత్వ క్రిస్టియన్ అఫైర్స్ అడ్వైజర్ రెవ. ఫాదర్ డాక్టర్ ఎం.బాలస్వామి ఆదివారం సందర్శించారు. ఏబీఎం చర్చి ప్రెసిడెంట్ జి.మార్కు, జి.ఇశ్రాయేలు, ఫాదర్ బాలస్వామిని ఘనంగా సత్కరించారు. హౌస్ ఆఫ్ ప్రేయర్స్ చర్చి రెవ పాస్టర్ సత్యం, పాస్టర్ జార్జ్ సత్కరించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు చుక్కా మోషే గృహంలో విందు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాస్టర్లు టి.రాజు, జి.పున్నయ్య, పాస్టర్ జి.సుధీర్ కుమార్, పి.స్వరూప కుమార్, సంఘ పెద్దలు, చర్చి సభ్యులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



క్రోసూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పాల్‌రవీందర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన క్రోసూరు నాలుగు రోడ్ల సెంటర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపటం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తనిఖీలో పట్టుబడితే వాహనంతో పాటు యజమానిపై కేసులు నమోదు చేయటం జరుగుతుందన్నారు.

క్వారీ వేస్ట్ రాయికి రాయల్టీ చెల్లించలేం

ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానుల ఆందోళన



క్వారీ వేస్ట్ రాయిని తీసుకొస్తున్న ట్రాక్టర్‌ను ఆపిన చెక్‌పోస్టు నిర్వాహకులు

పిడుగురాళ్ల: క్వారీలో వేస్ట్ రాయి, మట్టి తోలుకునే వారికి కూడా రాయల్టీ చెల్లించాలని చెక్ పోస్టు నిర్వాహకులు ట్రాక్టర్లను నిలిపివేయటంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు పిల్లుట్ల రోడ్డులోని సున్నపుబట్టీల సెంటర్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు మాట్లాడుతూ వేస్ట్ రాయి ఒక ట్రిప్పుకు రూ.400లు వస్తాయి, అందులో లోడింగ్ చేసినందుకు రూ.100, డీజిల్‌కు రూ.100, డ్రైవర్‌కు రూ.100 పోను మిగిలేది వంద రూపాయలు మాత్రమే. రోజుకు నాలుగు లేదా ఐదు ట్రిప్‌లు మాత్రమే ఒక ట్రాక్టర్ ద్వారా రవాణా జరుగుతుందని తెలిపారు. రోజుకు రూ. 500లు కూలీ గిట్టుబాటు అవుతుంది, ఒక ట్రిప్ వేస్ట్ రాయి, మట్టికి రూ. 250 రాయల్టీ చెల్లించాలని, లేని పక్షంలో వేస్ట్ రాయిని అక్కడ వదిలివేసి వెళ్లాలని చెక్ పోస్టు నిర్వాహకులు హుకుం జారీ చేయటంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, ట్రాక్టర్లను చెక్‌పోస్టు సమీపంలోనే నిలుపుదుల చేసి ఆందోళనకు దిగారు. అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆందోళనను గమనించి ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులతో మాట్లాడారు. సమస్యను రెండురోజుల్లో పరిష్కరిస్తానని తెలపటంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



సర్వేను పరిశీలించి, సూచనలిస్తున్న కౌన్సిలర్ కల్యాణి

సత్తెనపల్లి: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని 12వ వార్డు కౌన్సిలర్ లోక కల్యాణి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే, ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్వేను పరిశీలించిన కౌన్సిలర్ కల్యాణి వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

10లోపు ఈకేవైసీ చేయించుకోవాలి

ముప్పాళ్ళ: మండలంలో సాగు చేపట్టిన రైతులు పంటలకు ఈ నెల 10వ తేదీలోపు ఈకేవైసీ చేయించాలని మండల వ్యవసాయాధికారిణి ఎం.అరుణ ఆదివారం చెప్పారు. ఈ–క్రాప్‌లో పంట నమోదు చేసిన రైతుల వివరాలు సోషల్ ఆడిట్‌లో భాగంగా గ్రామ సచివాలయంలోని నోటీసు బోర్డులో ఈ నెల15వ తేదీ వరకు అందుబాటులో ఉంచటం జరుగుతుందన్నారు. పంట నమోదులో ఏమైనా సమస్య వస్తే గ్రీవెన్స్‌లో స్వీకరించబడుతుందన్నారు. . రైతులు తప్పని సరిగా సాగు చేసిన పత్తి, మిరప, పసుపు, వరి పంటల వివరాలకు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

కాశీ అన్నపూర్ణ సత్రం సేవలు విలువైనవి

చిలకలూరిపేట: కాశీ అన్నపూర్ణ సత్రం సేవలు ఎంతో విలువైనవని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కొనియాడారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణమండపంలో కాశీ అన్నపూర్ణసత్రం ఆధ్వర్యంలో నిరుపేద ఒంటరి మహిళ కె.శ్రీదేవి కుమారుడు ఎనిమిదో తరగతి చదువుతున్న తేజా రంగారావుకు, ఆరో తరగతి చదువుతున్న కుమార్తె మీనాక్షికి కలిపి రూ.31వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ పుణ్యక్షేత్రాల్లో యాత్రికులకు అన్నదాన సౌకర్యం కల్పించటంతోపాటు నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించటం ఆదర్శనీయమని వెల్లడించారు.

తెలుగు బాప్టిస్టు చర్చికి శంకుస్థాపన

కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



శంకుస్థాపన ప్రత్యేక ప్రార్థనలో ప్రభుత్వ విప్ పీఆర్కే, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచ్

మాచర్ల రూరల్: శాంతి, సమానత్వం కోసం ఏసు క్రీస్తు చూపిన బాటలో పయనిస్తూ ప్రజల కోసం నిరంతరం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న చర్చిల అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా మంజూరు చేసి వారికి అండగా ఉంటామని పల్నాడు జిల్లా అధ్యక్షులు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో తెలుగు బాప్టిస్టు చర్చి శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం దైవ సేవలో పరితపిస్తున్న పాస్టర్ల సేవలు అమూల్యమన్నారు. నియోజకవర్గంలోని చాలా గ్రామాలలో చర్చిల నిర్మాణాలకు ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులు కేటాయించామన్నారు. క్రైస్తవుల కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి, సర్పంచ్ ఓరుగంటి జయప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ దశబంధపు కొండలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిలో 'ఆదర్శ'ం

- 15 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకొని ఆదర్శ కాలనీ
- వెయ్యి మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ



మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మహిళలు

పిడుగురాళ్ల: ఆదర్శ కాలనీని పట్టణంలోని కాలనీలన్నిటికీ ఆదర్శంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణ శివారులోని ఆదర్శ కాలనీలో ఆదివారం ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ నాయకులు ఎండీ జబ్బార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ ఆదర్శ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో రోడ్డు సౌకర్యం కూడా లేదని అన్నారు. ఈ ప్రాంతంలో మైనింగ్ లీజు ఉపసంహరించి ఇక్కడ నివసిస్తున్న వారందరికి ఇళ్ల పట్టాలు ఇవ్వటం జరిగిందన్నారు. ఇప్పటికే డ్రైనేజీ నిర్మించటం జరిగిందని, అలాగే ప్రధాన రహదారి నిర్మాణం కూడా త్వరలోనే చేపడతామన్నారు. కాలనీలో పైపులైన్‌లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి కొళాయిలు ద్వారా కృష్ణా జలాలు అందజేస్తామన్నారు. వచ్చే నెలాఖరుకల్లా బైపాస్ రోడ్డు పూర్తవుతుందని అలాగే మరో కొన్ని నెలల్లోనే హాస్పిటల్ ప్రారంభం అవుతుందని తెలిపారు. ఇది పూర్తి అయితే ఈ ప్రాంతంలో భూముల రేట్లు భారీగా పెరుగుతాయన్నారు. వచ్చే వేసవిలో పట్టాలు పొందిన వారికి ఇళ్ల నిర్మించుకునేందుకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కాగా గత 15 ఏళ్ల నుంచి ఇక్కడ నివసిస్తున్నామయ్యా, మమ్మల్ని ఏ నాయకుడు పట్టించుకోలేదయ్యా అని ఓ మహిళ అనటంతో స్పందించిన ఎమ్మెల్యే తాను చేతల నాయకుడినని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పేద ప్రజలు నివసించే కాలనీల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కాలనీలో ఇంకా పట్టాలు రాని వారు ఉంటే వారికి కూడా సర్వే నిర్వహించి వెంటనే ఇళ్ల పట్టాలను అందజేస్తానని, ఎవరు అధైర్యపడవద్దని ధైర్యం చెప్పారు. అనంతరం మహిళలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. ముందుగా కాలనీ వాసులు పూల వర్షంతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ముస్లిం నాయకుడు ఎండీ జబ్బార్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ గఫార్, పట్టణ కన్వీనర్ చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ కొమ్ము ముక్కంటి, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, బీసీ సెల్ అధ్యక్షులు కందులూరి శివయ్య, మాజీ జెడ్పీ టీసీ వీరభద్రునిరామిరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి పూర్ణ, పాతగణేశునిపాడు సర్పంచ్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు వెంకటేశ్వర్లు, షేక్ జాని, అజ్మీర శారద, అన్నెం బంగారురెడ్డి, కె.వాసుదేవరెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్‌చైర్మన్ ఎండీ రషీద్, ఎండీ అలీం, సుభానీ, రహమాన్, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, వీఆర్‌వో కోటేశ్వరరావు, ఇర్లా గురుస్వామి, నాగరాజు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం

కేసానుపల్లిలో రూ.50లక్షలతో అభివృద్ధి పనులు



కేసానుపల్లి ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లి గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రూ.50 లక్షల ప్రభుత్వ నిధులతో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్లు నిర్మించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని కోరారు. కాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉండటంతో రోడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.50లక్షల నిధులను ఎమ్మెల్యే కాసు మంజూరు చేయించారు. దీంతో సర్పంచ్ వినుకొండ చిన్న కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలను చేపట్టారు. ఈ పనులను ఏఈ శ్రీనివాసనాయక్, పంచాయతీ కార్యదర్శి నాగెండ్ల రత్నం, ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, స్థానిక నాయకులు బొల్లా శ్రీనివాసరావు, నెల్లూరి కోటేశ్వరరావు, ఉల్లేరు హనుమంతరావు, చుండు రామారావు, చెట్టిపాగు పాపయ్య, మీసాల ఆనందరావు తదితరులు పర్యవేక్షించారు. కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించటం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

తూనికల అధికారుల తనిఖీలు



గణపవరంలో ఓ చికెన్ దుకాణంలో ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకరరావు

నాదెండ్ల: తూనికలు, కొలతల అధికారులు ఆదివా రం మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో పలు వ్యాపార దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. కాటాల్లో వ్యత్యాసం ఉన్న ఏడుగురిని గుర్తించారు. వీరి వద్ద అపరాధ రుసుము వసూలు చేశారు. చికెన్ షాపులు, చిల్లర దుకాణాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలు, కాటా రాళ్లు, అడ్డకాటా తదితర వాటిని పరిశీలించారు. ప్రతి ఏడాది ఎలక్ట్రానిక్ కాటాలు ఉన్న యజమానులు రెన్యువల్ చేయించుకోవాలని, కాటా రాళ్లు, అడ్డకాటా ఉన్న వాళ్లు ప్రతి రెండేళ్లకోసారి తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలన్నారు. తూనికల్లో తేడాలు ఉంటే చర్యలు తప్పవని నరసరావుపేట ఏరియా ఇన్‌స్పెక్టర్ శంకరరావు హెచ్చరించారు. ఆయనతో పాటు సిబ్బంది వీరయ్య ఉన్నారు.